విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

- వణికిస్తున్న డెంగీ, టైఫాయిడ్ కేసులు
- వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల్లో చేరిక
- ఆలేరులో శనివారం నాటికి 100 దాటిన వైరల్ ఫీవర్ కేసులు


ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ఆలేరు: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ, టైఫాయిడ్ కేసులు అధికసంఖ్యలో నమోదవుతున్నాయి. శనివారం నాటికి వరకు ఆలేరులో వైరల్ ఫీవర్ కేసులు 105కు చేరడం ఆందోళన కలిగిస్తోంది. రోజుకు పదుల సంఖ్యలో అస్వస్థతకు గురవుతుండడంతో ఇటీవల ఆస్పత్రి వర్గాలు ఆలేరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను కలిసి డెంగీ కేసుల నమోదుపై అప్రమత్తం చేశారు. పలు కాలనీలను సూచిస్తూ అక్కడ పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని కోరారు.

పెరుగుతున్న కేసులు..

ఈ ఏడాది జూలైలో వైరల్ ఫీవర్‌తో 88మంది ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఆగస్టులో శనివారం నాటికి జ్వరపీడితుల సంఖ్య 100 దాటింది. 36మంది టైఫాయిడ్ బారిన పడి ఆస్పత్రి పాలయ్యారు. ఒక డెంగీ కేసు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. వాంతులు, విరేచనాలతో ఇప్పటివరకు 80మంది ఆస్పత్రిలో చేరారు. ఇందులో 15మంది చిన్నారులు, 65మంది ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఇక.. వైరల్ ఫీవర్ కేసులతో ప్రైవేట్ ఆస్పత్రులు కూడా కిటకిటలాడుతున్నాయి. అయితే వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే తిరస్కరిస్తూ జనగాం, భువనగిరికి రెఫర్ చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

దోమల నివారణకు ఫాగింగ్ చేపడుతున్నాం

పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటాం. పట్టణంలో దోమల నివారణకు ఫాగింగ్ చేపడుతున్నాం. మురుగు కాల్వల్లో నీరు నిల్వకుండా చూస్తాం. బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం. అందులో మురుగునీటిని పైప్‌ల ద్వారా వేరే చోటుకి తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. చెత్త తొలగింపు సక్రమంగా జరిగేలా చూస్తాం.
– శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ఆలేరు

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో పలు కాలనీల్లో దోమల బెడద తీవ్రంగా వేధిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. బస్టాండ్, సిల్క్‌నగర్, రైల్వేస్టేషన్ ఎదురు వీధి, మార్కండేయ కాలనీ, కాటమయ్య బస్తీ, పాత మున్సిపల్ కార్యాలయం, రంగనాయకుల వీధి, మంతపురి రోడ్డులో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చెత్త తొలగింపు, మురుగు కాల్వల శుభ్రం సరిగా జరగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాలనీల్లో ఫాగింగ్ చేయడంలో పారిశుద్ధ్య సిబ్బంది శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి.


ఆలేరులోని సిల్క్‌నగర్ కాలనీ సమీపంలో నిలిచిన మురుగు నీరు

వైద్యులు రాక ఖాళీగా కుర్చీలు


ప్రభుత్వాస్పత్రిలో శనివారం ఉదయం 10గంటలకు వైద్యులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న ఓపీ యూనిట్

ఆలేరు: ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు సకాలంలో అందక రోగులు అవస్థలు పడుతున్నారు. ఆలేరు పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి జ్వరాలు, దగ్గు, ఒళ్లు నొప్పులతో అస్వస్థతకు గురై చికిత్స కోసం రోగులు శనివారం ఉదయం పది గంటలకు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. ఓపీ విభాగం వద్ద వైద్యులు, ఇతర సిబ్బంది ఎవరూ లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చిందని వాపోయారు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ స్వప్న రాథోడ్‌ను వివరణ కోరగా.. శనివారం ఎమర్జెన్సీ కేసు రావడంతో తనతోపాటు ముగ్గురు వైద్యులు హాజరయ్యామని తెలిపారు. దీంతో ఓపీ వద్ద రోగులకు అసౌకర్యం కలిగిందని, తర్వాత యథావిధిగా ఓపీ కొనసాగిందని పేర్కొన్నారు. ఇక ముందు ఓపీ వద్ద ఇబ్బందులు రాకుండా చూస్తామని చెప్పారు.

సంతకాలు ఫోర్జరీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

యాదగిరిగుట్ట రూరల్: తమ సంతకాలు ఫోర్జరీ చేసి, తమకు తెలియకుండానే కోర్టులో కేసు వేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గ్రామంలో వారు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్ 376లో 47 ఎకరాల భూమిని ప్రభుత్వం గతంలో రజక కులస్తులకు కేటాయించిందని తెలిపారు. ఈ భూమికి సంబంధించి 2020లో తమ ప్రమేయం లేకుండా, పన్నెండు మంది ఫోర్జరీ సంతకాలతో ఓఎస్ నంబర్ 5ని క్రియేట్ చేసి, గ్రామానికి చెందిన వేరే వ్యక్తులపై కోర్టులో కేసులు వేసారని బాధితులు గడసంతుల మల్లేష్, కొమ్మరాజు చంద్రయ్య, కొమ్మరాజు లక్ష్మయ్య, కొమ్మరాజు సత్యనారాయణ, వడ్లకొండ బుచ్చయ్య, గడసంతుల శేఖర్ పేర్కొన్నారు.

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

భువనగిరి: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఈ నెల 25న ఇందిరా పార్కు వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేపట్టనున్న సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోదిరాందేవ్ యాదవ్ కోరారు. శనివారం స్థానిక జాగృతి డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

క్లుప్తంగా

టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ


న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న రాజ్‌కుమార్

భువనగిరి: పట్టణంలోని ఆర్‌కే ఆస్పత్రి, చావా ఫౌండేషన్ సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులకు శనివారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో టీబీ నిర్మూలన జిల్లా అధికారి డాక్టర్ సాయి శోభ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ యామిని, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ అశ్లేష, ఆర్‌కే ఆస్పత్రి ఇన్‌చార్జి కొండల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ప్రదర్శన

తుర్కపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ మెటీరియల్స్ ఎంతో ఉపయోగకరమని తహసీల్దార్ దేశ్యానాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లెంకల గీతారెడ్డి, ఎంఈఓ మాలతి, రాపెల్లి శ్రీనివాస్, మంజాషరాణి, స్వరూప రాణి, బాలమణి, చెన్నకిష్టయ్య, జక్కుల సుభాషిణి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని ప్రతిభ ఒకేషనల్ కళాశాలలో శనివారం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సీఐ మన్మథకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ విజయ్‌భార్గవ్, స్వర్ణలత, సిలివేరు ధనలక్ష్మి, శ్రీనివాస్, ముత్యాలు, లక్ష్మి, మురళి, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త దేశగోని వెంకటేశం అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స నిమిత్తం రాజీవ్ స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.15వేలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య శనివారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి ఎంఏ.ఖయ్యూం, కార్యదర్శి నల్ల నర్సింహ, కేతరాజు అచ్చయ్య, శామకూర రాజయ్య, బాబు, రావుల స్వామి, శామకూర యాదయ్య, రాజు, మాధవచారి పాల్గొన్నారు.

గురువులదే గురుతర బాధ్యత

రాజాపేట : విలువైన సమాజ నిర్మాణానికి గురువులదే గురుతర బాధ్యత అని జిల్లా సీఎంఓ పెసరు లింగారెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి జాని అప్షని అన్నారు. శనివారం రాజాపేట మండల కేంద్రంలోని బాలిక ఉన్నత పాఠశాలలో టీఎల్ఎం మేళా నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చందా రమేష్, కాంప్లెక్ ప్రధానోపాధ్యాయుడు మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు సమర్థవంతంగా నిర్వహించాలి

బొమ్మలరామారం: మండల స్థాయి క్రీడాపోటీలు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంఈఓ రోజారాణి అన్నారు. శనివారం మండల విద్యాధికారి కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడల సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల స్థాయి టోర్నమెంట్ అండర్ 14 బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు సెప్టెంబర్ 1న, అండర్ 17 బాలురకు సెప్టెంబర్ 2న నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ బుగ్గ శ్రీశైలం, మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింహ, వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్, ఉపేంద్ర, మహేష్, శోభరాణి, మధుసూదన్ రెడ్డి, డేవిడ్ కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన కేవీఎస్ నేషనల్ యోగా స్పోర్ట్స్ మీట్


సర్టిఫికెట్లు అందుకున్న వారితో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి

భువనగిరి: పట్టణంలోని పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయంలో ఈ నెల 19న ప్రారంభమైన 54వ కేవీఎస్ నేషనల్ యోగా స్పోర్ట్స్ మీట్ –2025 పోటీలు శనివారం ముగిసాయి. అండర్–14,17,19 విభాగాల్లో జరిగిన పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గౌహతి రీజియన్‌కు చెందిన క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించగా, చెన్నై రీజియన్ రెండో స్థానం, జబల్‌పూర్ రీజియన్ క్రీడాకారులు మూడో స్థానంలో నిలిచారు. వారికి పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి బహుమతులు అందజేశారు.

చట్టాలపై అవగాహన సదస్సు


లోతుకుంట కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి సబిత

వలిగొండ : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, రామన్నపేట సీనియర్ సివిల్ కోర్టు జడ్జి సబిత అన్నారు. శనివారం వలిగొండ మండలంలోని లోతుకుంట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, పవిత్రాత్మ పాఠశాలకు అనుబంధంగా ఉన్న శాంతినిలయం బాలికల వసతి గృహంను తనిఖీ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ధైర్యంగా లీగల్ సర్వీసెస్ అథారిటీకి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ దంతూరి సత్తయ్య, స్పెషల్ ఆఫీసర్ దుర్గ, జాఫర్ అలీ, బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం పాల్గొన్నారు.

జూలూరు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్ రెండు మండలాల ప్రజలు రాకపోకలు సాగించడానికి అతిముఖ్యమైన జూలూరు– రుద్రవెల్లి వద్ద మూసీపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జూలూరు సమీపంలోని మూసీ వద్ద పోచంపల్లి, బీబీనగర్ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మేకల రవీందర్‌రెడ్డి, సందానంద గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గూడూరు నర్సోత్తమరెడ్డి, కార్యదర్శి ఎన్నం శివకుమార్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సుర్కంటి రంగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు డబ్బికార్ సాహేశ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ చిక్క కృష్ణ, జిల్లాకౌన్సిల్ సభ్యుడు పల్లెకాడి బస్వయ్య, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి

రాజాపేట : ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మేకల రమేష్ కోరారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో రాజాపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొలుసుకట్టు చెరువులను గోదావరి జలాలతో నింపాలని, ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా గైనకాలజిని నియమించాలని, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. మదర్ డెయిరీలో పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులు చెల్లించాలన్నారు. అనంతరం పలు అంశాలపై తహసీల్దార్ అనితకు వినతిపత్రం అందజేశారు. వారిలో సీనియర్ నాయకులు కానుగంటి శ్రీనివాస్‌రెడ్డి, దాచపల్లి రాజు, నాయకులు మెండు భగవాన్‌రెడ్డి, వినోద్, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, రామచంద్రం, శంకర్, కృష్ణ, సిద్దేశ్వర్ తదితరులున్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణాలు చేపట్టాలి

మోటకొండూర్: మండల కేంద్రం నుంచి ముస్త్యాలపల్లి మీదుగా జిల్లా కేంద్రానికి, ఆలేరు నుంచి కాటేపల్లి, వంగపల్లి నుంచి ఆత్మకూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కమిటికారి కృష్ణ కోరారు. శనివారం మోటకొండూరు మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం తహసీల్దార్ నాగదివ్యకు వినతి పత్రం అందజేశారు. వారిలో జిల్లా నాయకులు పీసరి తిరుమలరెడ్డి, తండ కృష్ణగౌడ్, మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, అనంతుల పాండు రంగారెడ్డి, పల్లా జితేందర్‌రెడ్డి, చిర్ర రవీందర్, గాజుల బాలరాజుగౌడ్, మల్ల అశోక్, దాసం నాగరాజు, రేగు మల్లేష్, గాజుల ప్రవీణ్ పాల్గొన్నారు.

అసంపూర్తి కాలువలు పూర్తిచేయాలి

ఆలేరురూరల్: ఆలేరు నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న కాలువల పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి మల్లేషం కోరారు. శనివారం ఆలేరు మండలశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొలనుపాక వాగుపై బ్రిడ్జి నిర్మించాలని, గుండ్లగూడెం రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి యూరియా ఇచ్చినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే బ్లాక్ మార్కెట్‌కు తరలుతోందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు పూజారి కుమారస్వామి, జిల్లా కౌన్సిల్ మెంబర్ భోగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అంకిరెడ్డి శ్రీనివాస్, కార్యదర్శి బైరి మహేందర్, అమరేందర్, తేరాల శంకర్, సందీప్, పరుశరాములు, సంతోష్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జూలూరు సమీపంలోని మూసీ వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి


రామన్నపేట: సురవరం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు


యాదగిరిగుట్ట: సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఐ నాయకులు


చౌటుప్పల్: సురవరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


ఆలేరు: పార్టీ కార్యాలయంలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఐ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల ఆ పార్టీ నాయకులు శనివారం సంతాపం తెలిపారు. యాదగిరిగుట్టలో సురవరం చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోదా శ్రీరాములు నివాళులర్పించారు. ఆలేరులోని సీపీఐ కార్యాలయంలో, వలిగొండ మండల కేంద్రంలో ఆపార్టీ నాయకులు సంతాపం తెలిపారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో వేర్వేరుగా సంతాపం తెలిపారు. మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర శనివారం సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి సీపీఐ మండల కార్యదర్శి వెంకట్ నివాళులర్పించారు. మోత్కూరులో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి సంతాపం తెలిపారు. సంస్థాన్ నారాయణపురంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జక్కలి ఐలయ్యయాదవ్‌లు సురవరం చిత్రపటానికి నివాళులర్పించారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి

చౌటుప్పల్ రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాగీరు కిష్టయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధుకృష్ణ కోరారు. సీపీఎం గ్రామీణ పోరుబాటలో భాగంగా శనివారం చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామంలో సమస్యలను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. వారిలో సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి పొట్ట శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు బోదాసు వెంకటేష్, నాయకులు మాడగోని మారయ్య, పల్లె శివకుమార్, బోదాసు నరేష్, పొట్ట వెంకటయ్య, బొడిగె సైదులు ఉన్నారు.

స్వర్ణగిరిలో సుదర్శన హోమం


హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

భువనగిరి: పట్టణంలోని స్వర్ణగిరి క్షేత్రంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో సుప్రభాత, తోమాల సేవ, సహస్ర నామార్చన జరిపించారు. నిత్యకల్యాణ మహోత్సవం, హనుమాన్ చాలిసా పారాయణం నిర్వహించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ జరిపించి,, రాత్రి జలనారాయణ స్వామి జలహారతి సమర్పించారు.

పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా అమలు చేయాలి

- కలెక్టర్ హనుమంతరావు


యాదగిరిగుట్ట రూరల్: మల్లాపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. శనివారం యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో ఆయన పర్యటించారు. అదేవిధంగా ఇంటి నిర్మాణం చేపట్టని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను పరిశీలించారు. లోన్లు ఇప్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు గ్రామాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ నవీన్ కుమర్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తుర్కపల్లి: మండలంలోని తిరుమలాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శనివారం కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. లబ్ధిదారులకు సహకరించి ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ గీతారెడ్డి, ఎంపీఓలు వెంకటేశ్వర్లు, సంతోష్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

పెద్దకందుకూరులో సీజనల్ వ్యాధులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి

యాదగిరిగుట్ట రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి మనోహర్ అన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును శనివారం ఆయన సందర్శించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. వీధుల వెంట, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేయించుకోవాలన్నారు. అంతకుముందు గ్రామంలో 45 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి పావని, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలి

మోత్కూర్: వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ ఒకేసారి వస్తున్నందున హిందూ, ముస్లింలు ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకుని మత సామరస్యాన్ని కాపాడాలని మోత్కూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మోత్కూర్‌లోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండల పరిధిలోని గణేష్ నవరాత్రి ఉత్సవాల కమిటీల ప్రతినిధులు, ముస్లింలతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు పొందాలన్నారు. సమావేశంలో ఎస్సై సతీష్ కుమార్, ఏఎస్ఐ వెంకన్న, హెచ్‌సీ నర్సింహ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీస్ కమిటీ సమావేశం

రామన్నపేట: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం రామన్నపేటలో ఏర్పాటు చేసిన పీస్‌కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మునీశ్వర జాతర

రామన్నపేట: మండలంలోని మునిపంపుల గ్రామంలో శ్రావణమాసం చివరి శనివారం రోజున సంప్రదాయం ప్రకారం మునీశ్వర జాతర నిర్వహించారు. గ్రామస్తులు డప్పుచప్పుళ్లు, కోలాటాలతో గుట్ట వద్దకు ప్రదర్శనగా వెళ్లి మునులు తపస్సు చేసిన మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాయసం నైవేద్యంగా సమర్పించారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లను అలంకరించి మునీశ్వరగుట్ట చుట్టూ ప్రదక్షిణ చేశారు.

25న మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 25న మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేయనున్నట్లు, ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆలేరు మండలం కాచారం రేణుకా ఎల్లమ్మ దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు వంగపల్లి అంజయ్య స్వామి శనివారం కలెక్టర్ హనుమంత రావును కోరారు. శనివారం ఆయనను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలి

తుర్కపల్లి: మండలం ముల్కలపల్లి గ్రామంలో బీటీ రోడ్డుపనులను పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ముల్కపల్లి– గొల్లగూడెం బీటీ రోడ్డుపై ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ.. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి ఎమ్మెల్యే గొంగిడి సునీత కృషితో ముల్కలపల్లి నుంచి గొల్లగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. పనులు తిరిగి ప్రారంభించకుంటే ముల్కలపల్లి, గొల్ల గూడెం, రామోజీనాయక్ తండా, దేవోజీ నాయక్‌తండా, గంగారంతండా ప్రజలను సమీకరించి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ప్రతిభ రాజేష్, బద్దునాయక్, భాస్కర్ నాయక్, మాజీ సర్పంచ్ మల్లప్ప, రామచంద్రం, మల్లేష్ యాదవ్, కనకరాజు, ఐలేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రెడ్ జోన్‌లో వీధి వ్యాపారాలు చేయొద్దు

చౌటుప్పల్ : రెడ్‌జోన్‌లో వీధి వ్యాపారాలు చేయొద్దని మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రాంరెడ్డి సూచించారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో వీధి వ్యాపారులు ఉన్న ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. రెడ్‌జోన్‌లో ఉన్నవారికి గ్రీన్ జోన్‌లో స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, టీపీఓ సెక్షన్ అధికారి ధనంత్ పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలి

ఆలేరురూరల్: పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి తెలిపారు. శనివారం ఆలేరు మండలం టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టం, హ్యూమన్ ట్రాఫికింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి నుంచి భీమనపల్లికి వెళ్లే మార్గంలో గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ వడ్డేపల్లి యాదగిరి కోరారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని హస్తినాపురం కాలనీలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు.

అభివృద్ధిలో వెనుకబడిన అర్బన్‌కాలనీ

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీ ఏర్పడి 40 సంవత్సరాలైనా అభివృద్ధిలో వెనుకబడి ఉందని సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ ఆరోపించారు. శనివారం సీపీఎం నాయకులు వార్డులో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించారు. ఈ సమస్యల పరిష్కారానికి 25న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

క్షేత్ర పర్యటనలు విజ్ఞానాన్ని ఇస్తాయి

రాజాపేట : క్షేత్రస్థాయి పర్యటనలు విజ్ఞానంతో పాటు వినోదాన్ని కలిగిస్తాయని సేయింట్ జకారియాస్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బిషప్ జాన్ గొల్లపల్లి, డెక్సర్ తిమోతి జాన్ గొల్ల పల్లి అన్నారు. శనివారం పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా రాజాపేటలోని రాజకోట, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చేనేత, మరమగ్గాలను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో హోమం

రాజాపేట : మండలంలోని రేణికుంట పరిధిలో గల శ్రీ సంకల్పసిద్ధి శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం శ్రీ అష్టలక్ష్మి సహిత లక్ష్మీ నారాయణ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కూర బద్రీనాథ్, కుంబాల ఎల్లారెడ్డి, సూదిరెడ్డి నాగిరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

ఆలేరురూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని తపస్ జిల్లా అధ్యక్షురాలు రేపాక ఉమా కోరారు. శనివారం ఆలేరు మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సుభాషిణి, వెంకటేశ్వర్లు, వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రావణమాస ముగింపు ఉత్సవాలు


అభిషేకం తర్వాత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని గర్భగుడిలోకి తీసుకెళ్తున్న భక్తులు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం, శ్రీపెరుమాండ్ల ఆంజనేయ స్వామి దేవాలయాల్లో శనివారం శ్రావణమాస ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు జరిపించారు. పెరుమాండ్ల ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబీకులైన ముత్యాల సత్తిరెడ్డి, ముత్యాల లక్ష్మారెడ్డి, ముత్యాల భూపాల్‌రెడ్డి, సామిడి రాఘవరెడ్డి, ముత్యాల మోహన్‌రెడ్డి, పాపిరెడ్డిలు ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

రాజాపేట : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీపీయూఎస్ మండల నాయకులు కోరారు. ఈమేరకు శనివారం తహసీల్దార్ అనితకు వినతిపత్రం అందజేశారు. వారిలో మండల అధ్యక్షుడు దుడుకు జానయ్య, ప్రధాన కార్యదర్శి పున్న సత్యానంద్ తదితరులు ఉన్నారు.